క్లుప్తంగా

విశేష అలంకరణలో బాలా త్రిపుర సుందరీదేవి



పుచ్చకాయల అలంకరణలో బాలా త్రిపుర సుందరీదేవి

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారిని పుచ్చకాయలతో అలంకరణ చేశారు. శ్రీరామ నవమి, వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన జున్నూరి కృష్ణలోవ దొరబాబు, శశిరేఖ దంపతులచే ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుచ్చకాయలతో అమ్మవారికి పూజ చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, బాలా త్రిపుర సుందరీదేవి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి



యండగండిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయించాలని యండగండి ఇమ్మానుయేలు లూథరన్ చర్చ్ క్రైస్తవ సోదరులు మండిపడ్డారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తగిన న్యాయం చేయాలంటూ ఆదివారం యండగండిలో క్రైస్తవ సోదరులు శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రసాదరావు మాట్లాడుతూ పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు జొదుల రాజ్‌కుమార్, ఏనేపల్లి సుబ్బరాజు, బొట్టు తాతారావు, కొమ్ముల దావీదు, విప్పర్తి బుచ్చియ్య, పీసీసీ సభ్యుడు తాడేపల్లి మోషే, నూకపాయి రాంకుమార్, గొర్రుముచ్చు సుందర్ కుమార్, వెలగపల్లి టోనీ, మానుకొండ సురేష్, విప్పర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాస్‌లు

తణుకు అర్బన్: ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం తరగతులకు హాజరువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల కూడా ఆర్టీసీ రాయితీ బస్సు పాస్‌ల కోసం రెన్యూవల్ చేయించుకోవచ్చని తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. సోమవారం నుంచి సంబంధిత ధ్రువ పత్రాలతో ఆర్టీసీ డిపోలోని కౌంటర్ వద్ద రెన్యూవల్ చేయించుకోవచ్చని వివరించారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. ప్రముఖ సీనియర్ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లోని ఆరుగురు వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. సూరపనేని సత్యనారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఈ వైద్య సేవల్లో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెంటపాడు: ఈ నెల 8న మంగళవారం మీనవిల్లూరు ఏసయ్యా ప్రార్థన మందిరం (పాస్టర్ కృష్ణ చర్చి)లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీవీ కృష్ణ ట్రస్టు వ్యవస్థాపకుడు పాస్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి లయన్స్ కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డుపై చెత్తతో వాహనదారుల ఇక్కట్లు

పెంటపాడు: డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్త రోడ్డుపైకి రావడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాచర్ల గ్రామం నుంచి రావిపాడు వెళ్లే దారిలో శివాలయం పక్కన శ్మశానం ఉంది. అదే ప్రాంతాన్ని పంచాయతీ అధికారులు డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. కాగా ఆ డంపింగ్ యార్డుకు గోడ అడ్డుగా లేకపోవడం వలన వేసిన చెత్త రోడ్డుపైకి వస్తోంది. దుర్వాసన రావడంతో అక్కడి ప్రజలు, అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీరాముని కల్యాణం

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరామ క్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులు సీతారాముల పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొని కనుల పండువగా సంబరాలు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన సీతారాముల పట్టాభిషేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో నిర్వాహకులు పీవీఎల్‌కు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు పానకం పోశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ శ్రీరాముడు యావత్తు ప్రపంచానికి ఆదర్శ పురుషుడన్నారు. కార్యక్రమంలో గుండా బత్తుల సుబ్బారావు, రణస్తుల మహంకాళి, కరిమెరక శివనాగరాజు, అశగిరి సత్యానంద్, ఏడిద శ్రీనివాస నెహ్రూ, రాయి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామునికి పీవీఎల్ పూజలు

కాళ్ల: శ్రీరామ నవమి సందర్భంగా కాళ్ల మండలంలో పలు గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పెదఅమీరంలోని శ్రీకోదండ రామాలయం ఆలయ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పానకం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పీవీ మర్యాద పూర్వకంగా సత్కరించారు. వీరి వెంట పార్టీ నాయకులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, మంతెన సునీల్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల: రాముల వారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భీమవరం: శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

గొల్లవానితిప్పలో వైభవంగా వేడుకలు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో కొలువైన శ్రీసీతా సమేత కోదండ రామునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు సాయినాథాచార్యులు స్వామి వార్లకు పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి వార్లకు కలశ పూజ, గౌరీ, విఘ్నేశ్వర, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసీతా రాముని కల్యాణ వైభవాన్ని భక్తులు తిలకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఉప సర్పంచ్‌లు గుద్దటి రవికుమార్, బుద్దాల రామకృష్ణ, కొప్పర్తి తాతాజీ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండలంలోని దొంగపిండి, కొత్తపూసలమర్రు, తోకతిప్ప, రాయలం, చినఅమిరం, పెదగరువు, తుందుర్రు, వెంప, గూట్లపాడు, అనాకోడేరు, కొమరాడ, తాడేరు, బేతపూడి గ్రామాల్లో నవమి వేడుకలు నిర్వహించారు.

రాముని జీవితం ఆదర్శనీయం

భీమవరం: రాముని జీవితం ఆదర్శనీయమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం నియోజవర్గలోని పలు ప్రాంతాల్లో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాకా వెంకట సత్యనారాయణ, సుభాష్‌రాజు, కాగిత సురేంద్ర, కలిదిండి వినోద్‌వర్మ, నార్ని తాతాజీ, అడబాల శివ, వబ్బిలిశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో మార్మోగిన రామాలయాలు

ఆకివీడు: రామనామ స్మరణతో రామాలయాలు మార్మోగాయి. రామ నవమి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సీతారాములోరి కల్యాణం కనుల విందుగా నిర్వహించారు. మండలంలోని కొల్లేరు తీరంలో సిద్ధులు స్థాపించిన పురాతన కోదండ రామాలయంలో రాములోరి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. 15 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠం నుంచి తీసుకొచ్చినవ ముత్యాల తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. స్థానిక మాదివాడలోని కోదండ రామాలయం, వెలంపేటలోనూ, కూరగాయల మార్కెట్, సంతమార్కెట్, ఎస్‌టర్నింగ్, రెడ్డి వీధిలో, పలు గ్రామాల్లో నవమి ఉత్సవాలు ప్రారంభించి, సీతారాములకు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా విసన కర్రలు, పానకం పంచిపెట్టారు.

నెహ్రూపేటలో శ్రీరామనవమి వేడుకలు

భీమవరం: పట్టణంలలోని 34 వార్డు నెహ్రూపేటలో శ్రీకోదండ రామాలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తారక రామ కనస్ట్రక్షన్స్ చైర్మన్ పళ్ల ఏసుబాబు, హేమలత దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పొత్తూరి బాపిరాజు, చనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వడ్డి సుబ్బారావు, జంపన ఫణిబాబు, పళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉండి: రాములోరిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో ఉత్సవ మూర్తులతో భక్తులు



ఆకివీడు: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతులు

గడ్డివాము దగ్ధం

భీమవరం: పట్టణంలోని 29వ వార్డు గాంధీనగర్ రెండో వీధిలో పశువుల పాకకు శనివారం రాత్రి నిప్పంటుకొని రెండెకరాల విస్తీర్ణంలో గడ్డివాము దగ్ధమైందని అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశ్‌రావు ఆదివారం చెప్పారు. కె.సుబ్బలక్ష్మికి చెందిన పశువుల పాకకు నిప్పంటుకోవడంతో సమాచారం తెలిసిన వెంటనే ఘటనా ప్రాంతానికి వెళ్లి గేదెలను బయటకు తీసుకొచ్చి మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదం వలన సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం ఏర్పడినట్లు అంచనా వేసినట్లు సూర్యప్రకాశ్‌రావు తెలిపారు.

నేటి నుంచి బస్‌పాస్‌ల రెన్యువల్

నరసాపురం: నరసాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు బస్టాండ్స్‌లో సోమవారం నుంచి ఇంటర్ విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు రెన్యువల్ చేస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి చెప్పారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు త్వరలో తరగతులు ప్రారంభకానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో విద్యార్థులు పాస్‌లు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

చలి వేంద్రం ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి వద్ద వారి సౌజన్యంతో ఆదివారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ తానేటి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. చలి వేంద్రంలో పానకం అందజేశారు. ఆసుపత్రి నిర్వాహకులు కె.సోమేశ్వరరావు, తిరుమళ్ల సూరిబాబు, డాక్టర్ బి.దివ్యశ్రీ, బాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

పెంటపాడు: ప్రత్తిపాడు సెంటర్‌లో వన్ టీం -వన్ విజన్ యూత్ సభ్యులు ఆదివారం చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని యూత్ సభ్యుల కోరిక మేరకు గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు బొలిశెట్టి రాజేష్ ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగను పాదచారులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ యూత్ సంఘసభ్యులు పాల్గొన్నారు.

రైతాంగంపై 'కూటమి' కన్నెర్ర

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నంద్యాల ధ్వజం



నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: రైతాంగ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. ఆక్వా, వరి రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వరి రైతులకు కనీసం మద్దతు ధర లభించకుండా చేస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో రైతులు అయినకాడికి అమ్ముకోవలసి వచ్చిందని ఆరోపించారు. దళారులు ప్రవేశించి ధాన్యంలో తేమ, రంగు మారిందని సాకులతో ధరలు తగ్గించి మిల్లర్లకు అమ్ముతున్నారన్నారు. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వరి రైతుల అకౌంట్లలో మద్దతు ధర పూర్తిగా పడిందన్నారు. ఈ దాళ్వా సీజన్‌లోనైనా రైతులకు మద్దతు ధర లభించే విధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలన్నారు. దళారుల బెడద లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

ఆక్వా రైతులను ముంచేశారు

ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం నిండా ముంచేసిందని సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గత పది నెలల్లో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక పక్క రొయ్యకు ధరను తగ్గించి వేస్తున్నారని, మరో పక్క మేత ధరలను విపరీతంగా పెంచి వేస్తున్నారని ఆరోపించారు. రొయ్య ధరలు కూటమి నాయకుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదని సీతారామయ్య ధ్వజమెత్తారు.

తూతూ మంత్రంగా నూతన విద్యా విధానం

భీమవరం: నూతన విద్యా విధానం అంటూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ప్రారభించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులపై విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. గత విద్యా సంవత్సరంలో ఎంతో కష్టపడి చదవి మొదటి సంవత్సరం పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులు మార్చి 20వ తేదితో పరీక్షలు ముగియడంతో రిలాక్స్ అయ్యారు. ప్రతి ఏటా పరీక్షలు పూర్తైన వెంటనే సెలవులు ఇవ్వడంతో బంధువుల ఇళ్లకు, ఇతర సందర్శన ప్రాంతాలకు వెళ్లడం పరిపాటి. అయితే కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఆదేశించడంతో సోమవారం తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 16 ప్రభుత్వ, 81 ప్రైవేటు కళాశాలల్లో సుమారు 19,762 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి రానున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 1,463 మంది విద్యార్థులు తరగతులకు హాజరుకావాల్సి ఉండగా కేవలం 179 మంది మాత్రమే హాజరయ్యారంటే నూతన విధానం పట్ల విద్యార్థుల్లో ఎంత ఆసక్తి ఉందో అవగతమవుతుంది. ఒక్కో గ్రూప్‌కు అతి తక్కువ మంది హాజరుకావడంతో లెక్చరర్లు క్లాసులు చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రమైన వీరవాసరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 81 మందికిగాను కేవలం 20 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం కొత్త ప్రయోగం పట్ల విద్యార్థులు, అధ్యాపకులు పెదవి విరుస్తున్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరైన ఐదుగురు విద్యార్థులు(ఫైల్)

వెంటనే క్లాసులు సరికాదు

మార్చి 20వ తేదీ వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలకు ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాశాం. కనీసం పది రోజులు సేదతీరకుండానే వెంటనే సెకండ్ ఇయర్ తరగతులు నిర్వహించడం అన్యాయం. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ముగియగానే అమ్మమ్మ ఇంటికో, సందర్శనా ప్రాంతాలకో వెళ్లాలని చూస్తారు. దీంతో తరగతులు నిర్వహించడం వలన పాఠాలపై విద్యార్థులు దృష్టి పెట్టరు.

-ఎస్.చరణ్య, వీరవాసరం

విరామం అవసరం

పబ్లిక్ పరీక్షలంటే ఎంత కష్టపడాలో అందరికీ తెలిసిందే. ఏడాది పాటు కఠోర దీక్షతో విద్యనభ్యసించి ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు విరామం అవసరం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎండలో తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. గతంలో మాదిరిగానే వేసవి సెలవులనంతరం విద్యా సంవత్సరం ప్రారంభించాలి.

-బాలయోగి, ఎంపీసీ విద్యార్థి, వీరవాసరం

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్‌ఏఐ) భీమవరం యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. భీమవరంలో ఆదివారం కోపా కల్యాణ మండపంలో నిర్వహించిన 36వ మహాజన సభలో యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా మంతెన వెంకట నర్సింహ సీతారామరాజు, కటికరెడ్డి వెంకటరత్నం, కోశాధికారి శ్రీఖాకొల్లు హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఆరేటి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బోనం పాండు రంగారావు, సరిపిడకల రామారావు, చైర్మన్‌గా మట్లపూడి సత్యనారాయణ, కన్వీనర్‌గా గన్నాబత్తుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా తాళ్లపూడి గాంధీ, వబిలిశెట్టి వెంకటేశ్వరావు, సాగి సత్యనారాయణరాజు, కడియం ఈశ్వరరావు, దేవరపు చంద్రశేఖర్, సోడదాసి అనిల్‌దేవ్, సుభద్రదేవి, కొప్పినీడి సూర్య ప్రకాష్, పిండి శ్రీనివాసరావు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, నేరేడిమిల్లి మహేష్ లను ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నేటి నుంచి సువార్త పండుగలు

పెంటపాడు: ఈ నెల 7,8 తేదీల్లో కోరిమిల్లి గ్రామంలో సువార్త పండుగలు నిర్వహించనున్నట్లు సంఘ దైవ సేవకులు మల్లిపూడి ఒనేసిం, అరుణ ఒనేసిమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలకు జి.డేనియల్ జిత్రో (వైజాగ్), షేక్ మక్బూల్ (రాజమండ్రి), జి.ఐజయ్య (బిట్రగుంట) హాజరువుతారన్నారు. పరిసర గ్రామ విశ్వాసులు తప్పక పాల్గొనాలని ఈ సందర్భంగా ఒనేసిం కోరారు.

పరాయి పంచన ప్రభుత్వ కార్యాలయం

పెనుమంట్ర: మండల రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి నాలుగు దశాబ్దాలు పూర్తి అవుతున్నా పెనుమంట్ర మండల రెవెన్యూ కార్యాలయానికి సొంత భవనం లేక పరాయి పంచనే ఇరుకు గదుల్లో సిబ్బంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 1985లో మండల రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పట్లో పెనుమంట్ర గ్రామ కచేరి భవనంలో మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. చాలీచాలని ఇరుకుగదులతో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో 2001లో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్రాహ్మణచెరువలో ఇరిగేషన్ బంగ్లాలో(పూర్వపు సమితి కార్యాలయంలో) రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో 2017లో పెనుమంట్ర మెయిన్ రోడ్డులో సొసైటీ పక్కన ఉన్న మహిళా మండలి భవనాన్ని మరమ్మతులు చేసి, అందులో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

శంకుస్థాపనకే పరిమితం

అనంతరం ఇరిగేషన్ బంగ్లాను కూల్చివేసి అదే స్థలంలో రూ.90లక్షల అంచనా వ్యయంతో రెవెన్యూ కార్యాలయాన్ని సొంత భవనాన్ని నిర్మించేందుకు 2018 ఏప్రిల్ 27న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికశాఖా మంత్రిగా ఉన్న, ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. అయితే ఈ భవన నిర్మాణాన్ని అర్ధాంతరంగా పునాది దశలోనే వదిలేశారు. ప్రస్తుతం పునాదులు కూడా శిథిలస్థితికి చేరాయి.



పెనుమంట్ర మహిళా మండలి భవనంల నిర్వహిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

సబ్‌స్టేషన్ నిర్మాణానికి మోక్షం కలిగేనా..?

- రూ.133 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణానికి గత ప్రభుత్వం అడుగు
- టెండర్ దశలో నిలిచిన భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

నరసాపురం: నరసాపురంలో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకుంది. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ దశకు చేరుకున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కొత్త కూటమి ప్రభుత్వంలో అటకెక్కింది. వేసవి వచ్చేసింది. జనం లో ఓల్టేజ్ సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టింది. అన్నీ సవ్యంగా సాగితే ఇప్పటికే సబ్‌స్టేషన్ సేవలు అందుబాటులోకి వచ్చేవి. గత ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీవో నెంబర్ 2368ని 2021 ఫిబ్రవ రినెలలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులకు అతీగతీ లేకుండా పోయింది.

లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెట్టాలని..

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మన్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకుపెంచారు. మళ్లీ అదనంగా దానికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని గత ప్రభుత్వలో నిర్ణయించారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ ప్రాజెక్ట్ మంజూరు చేయించారు. వెంటనే రుస్తుంబాధలో 10 ఎకరాల స్థలాన్ని సేకరించారు. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలి



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ముదునూరి ప్రసా దరాజు నిధులు మంజూరు చేయించారు. ఎన్నికలు రావడంతో టెండర్లు పిలవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. నిధులు అందుబాటులో ఉన్నాయి. టెండర్లు పిలిచి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయడానికి ఇబ్బంది ఏంటో అర్థం కావడం లేదు. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి లోకి వస్తే లో-ఓల్టేజ్ సమస్యలు ఉండవు.

- బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్